

## వాంకిడి సర్పంచ్ ప్రమాణ స్వీకారం

**ఉద్యమ కెరటం, వాంకిడి:** వాంకిడి సర్పంచ్ గా చునర్కర్ సతీష్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. స్పెషల్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్ నూతన సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు వడ్లూరి మొండి, షేక్ షాహిద్, ఠుర్సబాయి, అల్లుజ సంధ్యారాణి, అనిల్, రాములతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సతీష్ మాట్లాడుతూ తనను భారీ మెజార్టీతో గెలిపించిన వాంకిడి గ్రామ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రతినిత్యం అందుబాటులో ఉండి, గ్రామ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. అనంతరం వాంకిడి గ్రామపంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో ర్యాలీ నిర్వహించారు.

## పోలీసులు సహకరించాలి



**ఉద్యమ కెరటం, సిర్పూర్(యు):** పోలీసులు అన్నివిధాల సహకరించాలని రాఘాపూర్, భుర్నూర్ సర్పంచ్‌లు విజయబీర్ షా, పెందోర్ గణపతిలు అన్నారు. మంగళవారం ఎస్సై రామకృష్ణ రావును మర్యాద పూర్వ కంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే పోలీసుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

## నూతన సర్పంచ్‌కు సన్మానం



**ఉద్యమ కెరటం, సిర్పూర్(యు):** సిర్పూర్(యు) నూతన సర్పంచ్ గా బాధ్యతలు స్వీకరించిన ఆత్రం ఓంప్రకాష్‌ను బజార్‌గుడా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలవాతో సత్కరించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని, గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి నా లక్ష్యమని అన్నారు. పారదర్శక పాలన అందించి అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి యువత సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బజార్ గూడా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ ఆరీఫ్, జైస్వాల్ నవీన్, ఇమ్రాన్ ఖాన్, షేక్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్‌రూరల్:** గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సాలెగూడా గ్రామపంచాయతీ సర్పంచ్ కుమరం వందన అన్నారు. బుధవారం భాగ్య నగర్ కాలనీలో వాడవాడ తిరుగుతూ పలు సమస్యలను పరిశీలించారు. కాలనీలోని డ్రైనేజీల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం, రోడ్లపై పారుతున్న మురికి నీరు తదితర పరిశుభ్రత సమస్యలను ప్రత్యక్షంగా గమనించారు. ప్రతి వార్డులో నెలకొన్న సమస్యలను తెలుసుకుని స్థానిక ప్రజలతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా విధి దీపాలు, తాగునీటి సరఫరా, బోర్వెల్‌కు సంబంధించిన సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకురాగా, రెండు మూడు రోజుల్లోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భామనే సునీత, బండు రాము, భాస్కర్, సురేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయికి విద్యార్థి ఎంపిక



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రానికి చెందిన రెయిన్‌బో స్కూల్ 5వ తరగతి విద్యార్థి పద్వాల గురువేసింగ్ అబకస్ అండ్ వేదిక్ మాథ్స్ జోనల్ లెవెల్ కాంపిటీషన్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రకాష్ బుధవారం విలేకరులకు తెలిపారు. నిర్మల్ పట్టణంలో విశ్వం ఎడ్యూటేక్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అంతర జిల్లా పోటీల్లో ప్రతిభ కనబర్చి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

# పదవీ విరమణ ప్రయోజనాలు వెంటనే చెల్లించాలి



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఏప్రిల్ 2024 నుండి రిటైరైన పెన్షనర్లందరికి పదవీ విరమణ ప్రయోజనాలు వెంటనే చెల్లించాలి తెలంగాణ ప్రభుత్వ పెన్షన్ దారుల సంయుక్త కార్యచరణ సమితి జిల్లా ప్రతినిధి యం సుభాష్, సాయన్న డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 2024 నుండి పదవీ విరమణ చేసిన పెన్షనర్లకు వారికి రావలసిన పెన్షనరీ బెనిఫిట్స్ సకాలంలో రాక అప్పులు (ఈఎంఐ) లు కట్టలేక, పిల్లల పెళ్ళిళ్ళు, చదువులు ఆగిపోయి అవమాన భారంతో కొందరు ఆత్మహత్యలు చేసుకుంటుండగా మరికొందరు వృద్ధాప్యంలో అనేక రకాల రుగ్మతలతో ఆసుపత్రుల పాలై ఖర్చులు భరించలేక కొందరు అనేక ఇబ్బందులకు గురవుతున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పెన్షనరీ బెనిఫిట్స్ 20 నెలలుగా చెల్లించకపోవటయే కారణమని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే బడ్జెట్లో కేటాయించబడి, డైవర్ట్ చేసి ఇతర పనులకు వాడుకున్న మొత్తాలను తిరిగి వెనక్కి తెప్పించాలని కోరారు. పెన్సనర్స్ బెనిఫిట్స్ చెల్లించేందుకు మాత్రమే ప్రత్యేక నిధులు కేటాయించి ఏప్రిల్ 2024 నుండి రిటైరైన పెన్సనర్లకు మొత్తం బకాయిలు / బెనిఫిట్స్ ఒకేసారి చెలించాలని, ఆవిధంగా మరిన్ని పెన్షనర్ల మరణాలు ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీర్ ఖుర్ షిద్ అలీ, బషీర్ ఉద్దీన్, ఎం శివ ప్రసాద్, జీ ఎం స్వామి, రాజేంద్ర ప్రసాద్, ఎండీ సలీం తదితరులు పాల్గొన్నారు.

# బ్లాంకెట్ల పంపిణీ

## యువ న్యాయవాదులకు ఘన సన్మానం

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ (కాగజ్ నగర్) :** మతసామరస్యానికి మరియు సామాజిక సేవకు నిదర్శనంగా కాగజ్ నగర్ పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం దారుల్ అన్సార్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు బ్లాంకెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫాదర్ మాతున్, జామియా మసీదు ఇమామ్ మౌలానా ఇంతే ఖాబ్ ఆలం, ఆలయ పూజారి సంజయ్, గురుద్వారా గురు అమర్ సింగ్ హాజరై






సామాజిక ఐక్యతను చాటి చెప్పారు. ఈ సందర్భంగా న్యాయవాద వృత్తిలో విజయవంతంగా అడుగుపెట్టిన ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు ముస్లిం మైనారిటీ యువకులను ట్రస్ట్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఇటీవల ఎల్ఎల్‌బి లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి, హైకోర్టులో న్యాయవాద వృత్తిని ప్రారంభించిన ముహమ్మద్ అబ్దుల్ ముఫాసిల్, మహమ్మద్ సోహెల్ పాషా, సయ్యద్ లుక్మాన్ అహ్మద్‌లను పూలమాలలు, శాలువాలతో అభినందించారు. సిర్పూర్ టౌన్‌కు చెందిన కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ షకీల్ కుమారుడైన యువ న్యాయవాది ముహమ్మద్ అబ్దుల్ ముఫాసిల్ ఎల్ ఎల్ బి లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ కార్యక్రమంలో దారుల్ అన్సార్ ఛారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ అబ్దుల్ ఖుద్స్, రాష్ట్ర వైస్ చైర్మన్ హాఫీజ్ సయ్యద్ రిజ్వాన్, వైస్ ప్రెసిడెంట్ హాఫీజ్ ఎంఏ రియాజ్, మాజీ కౌన్సిలర్ శరత్ కుమార్, ఇమామ్ ముహమ్మద్ సద్దాం, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్యామ్ రావు, ట్రస్ట్ ప్రతినిధి సెక్రటరీ ముహమ్మద్ ముఫాఖం అహ్మద్, బీఆర్ఎస్ మైనారిటీ నాయకుడు జాకీర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



**ఉద్యమ కెరటం, వాంకిడి:** మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు తదితర ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆత్మకూరి చిరంజీవి డిమాండ్ చేశారు. బుధవారం మేరకు ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ అయేషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతోనే పనిచేస్తున్నారని,. ఆసుపత్రికి వచ్చే రోగులకు సేవలందిస్తున్నారని తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తున్న ఉద్యోగులకు గత ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భీమ్ ఎస్సీ, ఎస్టీ సోషల్ వెల్ఫేర్ సొసైటీ కాంట్రాక్టర్‌ను ఎన్నిసార్లు అడిగినా వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు శ్రమదోపిడికి గురవుతున్నారని, ఇప్పటివరకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించలేదని వాపోయారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నబీమ్ సొసైటీ పై వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు ప్రతినెల 5వ తేదీ లోపు బ్యాంక్ లో వేతనాలు జమ చేయాలని, గుర్తింపు కార్డులు, జాతీయ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పిప్పిరి వెంకటేష్, ఇటాన్కార్ తిరుపతి, అలాగే ఆసుపత్రి సిబ్బంది దినకర్, చంద్రశేఖర్, జమున, గౌరుబాయి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ ఆర్ఎంపీ డాక్టర్ అరెస్ట్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** అర్హత లేకుండా ఆర్ఎంపీ డాక్టర్‌గా చెలామణి అవుతూ హైడోస్ ఇంజక్షన్లు ఇచ్చిన కారణంగా వృద్ధ మహిళ మృతి చెందిన ఘటనలో నిందితుడిని బేల పోలీసులు అరెస్టు చేశారని జైనథ్ సీఐ జి శ్రావణ్ తెలిపారు. బుధవారం బేల ఎఎస్సైతో కలిసి వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బేల మండలం ఇందిరానగర్‌కు చెందిన ఊరవేత శాంతాబాయి (65) అనే వృద్ధ మహిళ ఛాతి నొప్పి ఉందని ఆయన వద్దకు వచ్చింది. అర్హత లేకున్నప్పటికీ ఆర్ఎంపీ లక్ష్మణ్ ఆమెకు ఇంజక్షన్‌తో పాటు మాత్రలు ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం ఆమె అస్వస్థతకు గురై కింద పడిపోయింది. దీంతో ఆమెను 108 అంబులెన్స్ లో ఆదిలాబాద్ రిమ్స్ కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితుడు అర్హత లేకుండా గత 15 సంవత్సరాలుగా నకిలీ డాక్టర్‌గా చెలామణి అవుతూ అమాయక ప్రజలకు హైడోస్ ఇంజక్షన్లు ఇస్తూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నట్లు గుర్తించారు. విచారణలో నిందితుడి వద్ద నుంచి ఉపయోగించిన సిరంజీలు, ఇంజక్షన్లు, గోలీలను స్వాధీనం చేసుకొని పంచనామా నిర్వహించారు. గతంలో కూడా ఇతనిపై ఇలాంటి కేసులు నమోదైనట్లు దర్యాప్తులో తేలింది. అర్హతలేని వైద్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## జాతీయ పురస్కారానికి సుకుమార్ పేట్కులే ఎంపిక



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రముఖ సాహితీవేత్త, బహుభాషా కవి, హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షులు, అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, హిందీ ఉపాధ్యాయులు సుకుమార్ పేట్కులేను భారతీయ సంవిధాన్ సన్మానం రాష్ట్రీయ గౌరవ పురస్కారం 2025కు ఎంపిక చేసినట్లు కార్యక్రమ నిర్వాహకులు ఆనంద్ భగత్ తెలిపారు. ఈ అవార్డును ఈనెల 28న మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా భద్రావతిలో మౌలిక్ అధికార్ సంఘర్ష్ సమితి, హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. బహుజన సాహిత్యం, సామాజిక న్యాయం కోసం చేసిన సేవలకు గాను ఈ గౌరవం లభించిందని తెలిపారు. గత 25 ఏళ్లుగా మహాత్మజ్యోతి రావు పులే రచనలను తెలుగు, హిందీ భాషల్లో అనువాదిస్తూ సామాజిక చైతన్యం కోసం కృషి చేస్తున్నానని సుకుమార్ పేట్కులే ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల పలువురు సాహితీవేత్తలు, సంస్థల ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# ప్రజల సొమ్ము ప్రజలకే చేరేలా 'ఉద్గామ్'



**మీ డబ్బు- మీ హక్కుపై కలెక్టరేట్‌లో అవగాహన**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** నామినీల వివరాలు తెలియకపోవడం, అవగాహన లేకపోవడంతో అనేక ఖాతాల్లో డబ్బు అలాగే ఉండిపోయిందని,. ప్రజల సొమ్ము ప్రజలకే చేరేలా ఆర్బీఐ 'ఉద్గామ్' యాప్‌ను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో "మీ డబ్బు%-% మీ హక్కు" అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అతిథిగా పాల్గొని మాట్లాడారు. బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి పది సంవత్సరాలుగా ఎలాంటి లావాదేవీలు జరగని ఖాతాల్లో ఉన్న సొమ్మును ఖాతాదారులు, వారి వారసులకు అందించే దిశగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఆర్బీఐ సూచనల మేరకు లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో క్లెయిమ్ కాని డిపాజిట్లపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా వివిధ బ్యాంకుల్లో సుమారు రూ.29 కోట్ల విలువైన డిపాజిట్లు పెండింగ్‌లో ఉన్నాయని, క్లెయిమ్ చేసిన కొందరు ఖాతాదారులు, వారసులకు బ్యాంకుల వారీగా నగదును అదనపు కలెక్టర్ శ్యామల దేవితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా వివరాలు తెలుసుకుని సంబంధిత బ్యాంకులను సంప్రదించి అవసరమైన పత్రాలు సమర్పిస్తే సులభంగా నగదును పొందవచ్చని సూచించారు. దీనిపై బ్యాంక్ సిబ్బంది, అధికారులు, మహిళా సంఘాలు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉత్పాల్ కుమార్ దాస్, ఆర్బీఐ రాష్ట్ర అధికారి దామోదర్, ఎస్బీఐ చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్, డీఆర్డీఓ, జెడ్పీ సీఈఓ రవీందర్ రాథోడ్, డీఎంహెచ్ నరేందర్ రాథోడ్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది, ఖాతాదారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# క్లెయిమ్ చేయని సొమ్ము తిరిగి పొందవచ్చు



**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** బ్యాంకులు, భీమా సంస్థలు, పోస్టాఫీసుల్లో ఖాతాలు కలిగి ఉండి క్లెయిమ్ చేయని సొమ్మును తిరిగి పొందేందుకు మీ డబ్బు-మీ హక్కు కార్యక్రమం ద్వారా అవకాశం కల్పించడం జరిగిందని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పదేళ్లు దాటి లావాదేవీలు లేకుండా ఖాతాల్లో నిల్వ ఉన్న నగదును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్‌లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. క్లెయిమ్ చేయని నగదుకు సంబంధించి ఖాతాదారులు, వారి వారసులు సంబంధిత బ్యాంకుల్లో కేవైసీ పత్రాలు, ఇతర అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించడం ద్వారా నగదును తిరిగి పొందవచ్చని చెప్పారు. బ్యాంకులను సంప్రదించడం, ఆర్బీఐకి సంబంధించిన ఉద్గమ్ పోర్టల్ ద్వారా సైతం వివరాలను తెలుసుకోవచ్చని సూచించారు. ఈ అంశంపై గ్రామ-సభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాల ద్వారా వయోజనులకు వివరించి విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 475 ఖాతాలకు సంబంధించి రూ.2 కోట్ల 88 లక్షల క్లెయిమ్ సొమ్మును ఇప్పటికే సెటిల్ చేయడం జరిగిందని వెల్లడించారు. అనంతరం కొన్ని అన్‌క్లెయిమ్ ఖాతాలకు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమం లో ఆర్బీఐ ఏజీఎం చేతన్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం అపర్ణ రెడ్డి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ ప్రశాంత్, ఏడీసీసీ బ్యాంక్ ఏజీఎం రవి కిషోర్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ కిరణ్ కుమార్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, అలాగే వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



# క్రిస్టియన్ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు

**కేసీఆర్ హయాంలోనే క్రైస్తవులకు పెద్దపీట: వంటేరు ప్రతాప్ రెడ్డి**

**ఉద్యమ కెరటం,గజ్వేల్:** క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్రిస్టియన్ సొసైటీ జిల్లా అధ్యక్షులు మోసెస్, మండల అధ్యక్షుడు రాజులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వంటేరు మాట్లాడుతూ.. ఏసు ప్రభువు దయతో ప్రజలందరికీ అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. గత కేసీఆర్ ప్రభుత్వం క్రిస్టియన్ సోదరులకు పెద్దపీట వేసిందని, పండుగ కానుకగా క్రిస్మస్ గిఫ్ట్‌లను అందించి గౌరవించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, రాష్ట్ర నాయకులు ఖాజా విరాసత్ అలీ, కౌన్సిలర్ గుంటుకు రాజు పాల్గొన్నారు.

# క్రిస్మస్ విందు కోసం 34 లక్షలు

**100 చర్చిలకు రూ. 30 వేల చొప్పున ఆర్థిక సాయం**

**వివరాలు వెల్లడించిన కలెక్టర్ రాహుల్ రాజ్**

**ఉద్యమ కెరటం, మెదక్:** క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవ సోదరులు ఆనందంగా పండుగ జరుపుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మెదక్ జిల్లాలోని వివిధ చర్చిల్లో విందు (ఫీస్ట్) ఏర్పాటు కోసం మొత్తం రూ. 34 లక్షలను ప్రభుత్వం కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. నిధుల వివరాలివే: బుధవారం ఆయన ఈ విషయమై మాట్లాడుతూ.. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోని ప్రధాన వేడుకల నిర్వహణకు ఒక్కో నియోజకవర్గానికి రూ. 2 లక్షల చొప్పున మొత్తం రూ. 4 లక్షలు మంజూరు చేశామన్నారు. అలాగే, జిల్లాలోని రెండు నియోజకవర్గాల పరిధిలో ఎంపిక చేసిన 100 చర్చిలకు.. ఒక్కో చర్చికి రూ. 30 వేల చొప్పున మొత్తం రూ. 30 లక్షలు విడుదల చేసినట్లు వివరించారు. ఇప్పటికే ఈ నిధులను సంబంధిత చర్చిలకు అందజేశామని తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం నస్పూర్ మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పోషక విలువలు కలిగిన మెనూ అమలు చేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు చేసిన అల్లికలు, కళాకృతులను పరిశీలించారు. వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఏకాగ్రతతో చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని పదో తరగతి విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# సర్పంచ్ ఇమ్రాన్‌కు ఘన సన్మానం

**ఉద్యమ కెరటం, నిర్మల్:** తెలంగాణ ముస్లిం ఏక్తా సోషల్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షులు ఇమ్రాన్ మాదాపూర్ గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన సందర్భంగా ఆ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ తమ సంఘం నుంచి సర్పంచ్‌గా ఎన్నిక కావడం గర్వకారణమని పేర్కొంటూ ఇమ్రాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం ద్వారా ప్రజాసేవ మరింత విస్తృతంగా కొనసాగుతుందని తెలిపారు. అనంతరం సంఘం అధ్యక్షులు షేక్ ముజాహిద్ మాట్లాడుతూ ప్రస్తుతం సొసైటీ సభ్యుడు సర్పంచ్‌గా ఎన్నికయ్యారని, భవిష్యత్తులో మున్సిపల్ కౌన్సిలర్లు కూడా తెలంగాణ ముస్లిం ఏక్తా సంఘం తరపున ఎన్నికయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు సాజిద్, ప్రధాన కార్యదర్శి అల్మాస్ ఖాన్, అఫ్రోజ్ పాషా ఖాన్, మోయిజ్, ఫజిల్ హాష్మి పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి సహకరించాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ(ఇచ్చోడ):** మండలంలోని సాత్ నంబర్ గ్రామ అభివృద్ధికి అధికారులు సహకరించాలని సర్పంచ్ రమేష్ రాథోడ్, ఉప సర్పంచ్ షబ్బీర్ అలీ కోరారు. బుధవారం ఇచ్చోడ మండల తహశీల్దార్, ఎంపీడీఓ, సీఐ, ఎస్సై, విద్యుత్ శాఖ ఏఈ, జీపీఓలను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు ఉన్నారు.

# నట్టల నివారణ మందు పంపిణీ



**ఉద్యమ కెరటం, తాండూర్:** ప్రభుత్వం పంపిణీ చేసిన నట్టల నివారణ మందును మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బుధవారం తాండూర్ పశు వైద్యులు డాక్టర్ నరసింహారావు ఆధ్వర్యంలో సిబ్బంది గొర్రెలకు, మేకలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యులు మాట్లాడుతూ పశుపోషకులు గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందును తాగించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో కొత్తపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆకుల వెంకటేష్, కుర్మ సంఘం నాయకులు అన్నం మల్లేష్, నరిగే ఐలయ్య, ముదిగిరి రాజయ్య, ఎగ్గా బీరయ్య, కోరే రాజేష్, అన్న రాజేష్, పశు వైద్య సిబ్బంది దుర్గం కళ్యాణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్లాట్ బుకింగ్ నిబంధనల్లో మార్పులు

**ఉద్యమ కెరటం, తాండూర్:** కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆదేశాల మేరకు కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుకింగ్ పరిమాణానికి సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేయడం జరిగిందని మంచిర్యాల జిల్లా మార్కెటింగ్ అధికారి ఎండి షహబుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిబంధన బుధవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తుందని, బుక్ చేసిన స్లాట్ లకు రైతులు బుక్ చేసిన పరిమాణానికి గరిష్టంగా అదనంగా 5 క్వింటాళ్ల వరకు మాత్రమే పత్తిని విక్రయించడానికి అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. దీనికి మించి పత్తిని తీసుకోబడదని తెలిపారు. పత్తి రైతులు ఈ విషయాన్ని గమనించి స్లాట్ బుకింగ్ సమయంలో సరైన పరిమాణాన్ని నమోదు చేసుకొని పత్తి కొనుగోళ్లకు సహకరించాలని కోరారు.

# పీసా చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** గిరిజన ప్రాంతాల ప్రజలు పీసా చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ శేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని రోల్ మామడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తొడసం శంకర్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులకు పీసా చట్టంపై అవగాహన కల్పించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ చట్టాల సవరణ పీసా చట్టం గిరిజన ప్రాంతాల గుర్తింపు రాష్ట్రాలు, గిరిజన ప్రాంతాలను గుర్తించి, వాటికి పీసా చట్టం ప్రయోజనాలను అందించడం వంటి పలు అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆర్క నాగరావ్, ఎపీఓ వసంత్ రావ్, పంచాయతీ కార్యదర్శి హారిక, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

